
కూలీల అవస్థలు పట్టవా!

- మండుటెండలో ఉపాధి హామీ పనులు
- కానరాని కనీస సౌకర్యాలు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న కూలీలు



మండుటెండలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు



తనకల్లు: మండుతున్న ఎండల్లో ఉపాధి హామీ కూలీలు అవస్థలు పడుతున్నారు. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో వారి పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. పనులు గ్రామాలకు దూరంగా జరుగుతుండడంతో కాసేపు సేద తీరడానికి నిలువ నీడ లేని పరిస్థితి నెలకొంది. ఇక పని ప్రదేశంలో ఏదైనా ప్రమాదం జరిగితే కనీసం ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది.

మండుటెండలోనే పనులు..

కదిరి నియోజకవర్గ వ్యాప్తంగా 43,534 జాబ్‌కార్డులున్నాయి. వీటిలో 38,356 యాక్టివ్ జాబ్‌కార్డులుండగా 81,484 మంది ఉపాధి హామీ కూలీలు ఉన్నారు. అయితే ఉపాధి పనుల వద్ద కూలీలకు సౌకర్యాలు అందని ద్రాక్షగా మారాయి. మండుటెండలో పనులు చేసే కూలీలు వడదెబ్బకు గురయ్యే ప్రమాదమూ లేకపోలేదు. ఉపాధి పనులు జరిగే చోట నీడ, చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలి. కూలీలు పని చేస్తున్న సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే ప్రథమ చికిత్స కిట్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి. కూలీలు ఎవరైనా అస్వస్థతకు గురైతే వారిని తక్షణం ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించాలి. చంటి బిడ్డలకు పాలివ్వడానికి , పిల్లలను నిద్రపుచ్చేందుకు నీడతో పాటు చెట్ల వద్ద ఊయలలు వంటివి సమకూర్చాలి. అయితే ఇలాంటి సౌకర్యాలు ఎక్కడా కనిపించడం లేదు. సంబంధిత అధికారులు ఇవేవీ ఏర్పాటు చేయకపోవడంతో కూలీలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు.

ఊసేలేని వేసవి భత్యం..

కూలీలకు వేసవిలో చెల్లించే వేసవి భత్యం ఊసే లేదని కూలీలు వాపోతున్నారు. గతంలో ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే, జూన్ నెలలో వేతనంతో పాటు అదనంగా వేసవి భత్యాన్ని అందించేవారు. అయితే ఈ ఏడాది ఏప్రిల్ నెల గడుస్తున్నా ఇప్పటి వరకు వేసవి భత్యం అమలుకు ఎలాంటి ఆదేశాలు అందకపోవడంతో కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కదిరి నియోజకవర్గంలోని ఉపాధి హామీ కూలీల వివరాలు

మండలం	మొత్తం జాబ్‌కార్డులు	మొత్తం కూలీలు
తనకల్లు	5, 519	10,149
తలుపుల	10,082	19,370
ఎన్‌పీకుంట	7,225	13,188
నల్లచెరువు	5,351	9,796
కదిరిరూరల్	8,042	14,844
గాండ్లపెంట	7,315	14,137

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

కూలీల సమస్యలను ఉన్నతాధికారు దృష్టికి తీసుకెళ్లాం. ఆదేశాలు అందగానే కూలీలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తాం. అంతవరకు పనులు జరిగే చోట తాత్కాలికంగా నీడ కోసం పందిళ్లు వేయించాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించాం. పీహెచ్‌సీల నుంచి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు తీసుకొని కూలీలకు అందజేస్తాం.

– మరియమ్మ, ఏపీఓ, తనకల్లు

ఎలాంటి సౌకర్యాలూ లేవు



ఉపాధి పనులు చేసే చోట ఎలాంటి సౌకర్యాలు లేవు. దీంతో మేం చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇలాంటి సమయంలో కొలతల ప్రకారం పనులు చేయలేకపోతున్నాం. అధికారులు ఉపాధి పనులు జరిగే చోట అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలి.

– ఖాజావలి, ఉపాధి కూలీ, కోటూరు, తనకల్లు మండలం

వేసవి భత్యం అందించాలి



ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్నాయి. ఎండలో పనులు చేయలేక కూలీలు అల్లాడిపోతున్నారు. గతంలో లాగా ఉపాధి హామీ పనులు జరిగే చోట నీడ, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు, మజ్జిగ, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు తదితర సౌకర్యాలను కల్పించాలి. వేసవి భత్యాన్ని చెల్లించాలి.

– శివన్న, సీపీఎం నాయకుడు, తనకల్లు

క్లుప్తంగా

భక్తులతో ఖాద్రీ ఆలయం కిటకిట



ఖాద్రీశుడి దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వారాంతపులు సెలవులు కావడంతో కర్ణాటక, చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి తరలివచ్చారు. మహిళలు ఆలయం ముందు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అధికారులు భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు అన్నదానం ఏర్పాటు చేశారు.

అదనపు జిల్లా కోర్టు ఏర్పాటు చేయాలి



జస్టిస్ కే.సురేష్‌రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న కదిరి బార్ అసోసియేషన్ సభ్యులు

అనంతపురం: కదిరిలో అదనపు జిల్లా కోర్టు ఏర్పాటు చేయాలని కదిరి బార్ అసోసియేషన్ సభ్యులు కోరారు. శనివారం అనంతపురం పర్యటనకు వచ్చిన ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ కే.సురేష్ రెడ్డిని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కలసి సమస్యలు విన్నవించారు. కదిరి చుట్టుపక్కల 10 మండలాలు ఉన్నాయని తెలిపారు. ఇందుకు జస్టిస్ కే.సురేష్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో కదిరి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చౌడప్ప, జనరల్ సెక్రెటరీ సురేంద్ర, మాజీ అధ్యక్షుడు నాగేంద్ర రెడ్డి, న్యాయవాదులు భైరవ ప్రసాద్, రామస్వామి, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి ఆపరేషన్‌కు ఆర్థికసాయం



చిన్నారి తండ్రికి నగదు అందిస్తున్న షాన్‌వాజ్

కదిరి టౌన్: చిన్నారి ఆపరేషన్‌కు కాంగ్రెస్ కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కెఎస్.షాన్‌వాజ్ ఆర్థికసాయం అందించారు. పట్టణానికి చెందిన అహమ్మద్ బాషా కుమార్తె ఫాతిమా(15 నెలలు) క్యాన్సర్‌తో బాధపడుతోంది. చిన్నారికి బెంగళూరులో ఆపరేషన్ చేయాల్సి ఉంది. ఇది వరకే రూ.25 వేలు ఆర్థికసాయం చేసిన షాన్‌వాజ్ శనివారం మరోసారి రూ.80 వేలు నగదు చిన్నారి తండ్రికి అందజేశారు. చిన్నారి ఆపరేషన్ విజయవంతం కావాలని అల్లాను ప్రార్థించాలని కోరారు. నాయకులు అల్లాబక్ష్, జైనుల్లా, సుహైల్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో దాహార్తి తీరుద్దాం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌ఐ సోమశేఖర్

బత్తలపల్లి: దాతల సహకారంతో దాహార్తిని తీర్చుదామని ఎస్‌ఐ సోమశేఖర్ పేర్కొన్నారు. శనివారం ఆయన నాలుగు రోడ్ల కూడలి వద్ద దాతల సహకారంతో పోలీసులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఏఎస్‌ఐ సోమశేఖర్‌మూర్తితో కలిసి ప్రారంభించారు. చలివేంద్రానికి మినరల్ వాటర్‌ను అందించనున్న యజమానులు కోటి సురేష్, కోటి నరేష్, పల్లపోతుల శ్రీరాములు, ఖలందర్ బాషా, కృష్ణయ్య, కోటి అంజి, గుజరి వెంకటేష్ తదితరులను అభినందించారు. ఏఎస్‌ఐ తిరుపాలు, సిబ్బందితో పాటు రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, దండోరా ధర్మవరం డివిజన్ నాయకులు సాకే లక్ష్మన్న పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



వైద్యసిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎంహెచ్‌ఓ ఫైరోజాబేగం

పుట్టపర్తి టౌన్: పట్టణంలోని ఎనుములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ ఫైరోజాబేగం శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా సిబ్బందితో ప్రజలకు అందించే వైద్యసేవలు, అసంక్రామిత వ్యాధులపై సర్వే మాతా శిశుసంరక్షణ, వ్యాధి నిరోధక టీకాలు, ఓపీ సేవలు, ల్యాబ్, కాన్పులపై ఆరా తీశారు. రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని వారికి సూచించారు. డాక్టర్ జ్యోత్స్న, మునిచంద్రిక, సీహెచ్‌ఓ నగేష్, సిబ్బంది ఉన్నారు.

శ్రీరామ నవమి శుభాకాంక్షలు



దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

నల్లమాడ: పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి నియోజకవర్గ ప్రజలకు శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. నల్లసింగయ్యగారిపల్లిలోని స్వగృహంలో శనివారం ఆయన మాట్లాడారు. శ్రీరాముడి కరుణా కటాక్షాలతో మంచి వానలు కురిసి ఆయురారోగ్యాలు, పాడిపంటలు, పశుసంపదతో ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

నేడు సీతారాముల కల్యాణం

కదిరి టౌన్: స్థానిక మారుతీనగర్‌లో ఉన్న పంచముఖ అంజనేయస్వామి ఆలయంలో ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా ఆలయంలో సీతారాముల కళ్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ డాక్టర్ శంకరయ్య ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5:30కు జరిగే వేడుకకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

కనగానపల్లి: శ్రీరామనవమి పండుగ సందర్భంగా ఆదివారం మండలంలోని పలు గ్రామాలలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించనున్నారు. కనగానపల్లి, మామిళ్లపల్లి, తగరకుంట, కొత్తూరు గ్రామాల్లోని ఆలయాల్లో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం సాయంత్రం నుంచి రామాలయాల్లో గణపతి పూజ, నవగ్రహ, శాంతిహోమాలు చేపట్టారు. సీతారాముల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

మార్కెట్ యార్డు కమిటీలో చోటు

బత్తలపల్లి: ధర్మవరం మార్కెట్ యార్డు కమిటీలో సంజీవపురం గ్రామానికి చెందిన ముల్లగూరు అయ్యప్ప వైస్ చైర్మన్‌గా, పోట్లమర్రి గ్రామానికి చెందిన కమతం వాణి డైరెక్టర్‌గా నియమితులయ్యారు. తమ ఎంపికపై వారు శనివారం ఆ పార్టీ నేతలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పడమటి వీరన్నకు తరలిన పన్నేరపు బండ్లు



పడమటి ఈరన్నకు వెళ్తున్న ఎడ్లబండి, వాహనాలు

బత్తలపల్లి: మూగజీవాల పట్ల కరుణచూపే ఆరాధ్యదైవం పడమటి వీరన్నకు శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని శనివారం మండలం నుంచి భారీగా పశువులు, పన్నేరపు బండ్లు తరలివెళ్లాయి. తాడిమర్రి మండలం ఆత్మకూరు గ్రామ సమీపంలో వెలసిన పడమటివీరన్నకు మొక్కుకుంటే పశువులకు కీడు జరగదన్నది ప్రజల విశ్వాసం. ఇందులో భాగంగా శ్రీరామనవమి పండుగ ముందు రోజు పడమటివీరన్నకు మండలం నుంచేకాక ముదిగుబ్బ, తాడిమర్రి, ధర్మవరం, అనంతపురం మండలాల నుంచి అధికంగా రైతులు పన్నేరపు బండ్లు, పశువులు, ట్రాక్టర్లను అందంగా అలంకరించుకొని, మరికొందరు వాహనాలలో తరలివెళ్లిన భక్తులు ఆయనకు ప్రదక్షిణలు చేయడం పరిపాటిగా మారింది. ప్రతి ఇంటి నుంచి పిటికెడు తీసుకువెళ్లే బియ్యం, బేడలు, బెల్లం భక్తులు సమర్పించుకుంటారు.

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటాం



పుట్టపర్తిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



అమడగూరులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

- మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

అమడగూరు: గత ప్రభుత్వంలో సమన్యాయం అనే సిద్ధాంతంతో ముందుకెళ్లామని, ఈ సారి కచ్చితంగా అధికారంలోకి వస్తామని తప్పకుండా ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం అమడగూరు చౌడేశ్వరీ కల్యాణ మండపంలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆచరణ సాధ్యం కాని హామీలను ఇచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని మండిపడ్డారు. జగనన్న కూడా తప్పుడు హామీలను ఇచ్చుంటే తప్పకుండా అధికారంలోకి వచ్చేవాళ్లమని, అయితే ఈ రోజు తల దించుకుని వెళ్లే పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నా తల ఎత్తుకుని తిరుగుతున్నామంటే దానికి కారణం గతంలో జగనన్న చేసిన మంచి పాలనే అన్నారు. వైఎస్సార్‌సీపీలో కీలకంగా పని చేసిన వారందరి పైనా కూటమి ప్రభుత్వం కేసులు పెట్టి హింసిస్తోందని ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని, జగనన్న కోసం, రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం ఎందాకైనా పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ప్రతి మండలంలో నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మండల కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, నాయకులు శివశంకర్‌రెడ్డి, శేషురెడ్డి, మాజీ జెడ్పీటీసీ పొట్టా పురుషోత్తమరెడ్డి, జయప్ప, శ్రీధర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, నక్కలచిన్నప్ప, నాగరాజు, రంగారెడ్డి, సూర్యనారాయణరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, సిభక్తుల్లా, హరినాథరెడ్డి, రమేష్, నారాయణస్వామి, అన్సర్, హనుమంతరెడ్డి, మీసాల నాగరాజు, గోపీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

సైనికుల్లా పని చేయండి

ఓడీచెరువు: ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్తా సైనికుడిలా పని చేసి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక షాదీమహల్‌లో జరిగిన పార్టీ మండల స్థాయి విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 10 నెలల పూర్తయినా ఎన్నికల హామీలు అమలు చేయడం లేదన్నారు. ప్రతి ఇంటికీ ఓ ఉద్యోగం అని నమ్మబలికి గద్దె నెక్కిన తర్వాతా ఉన్న ఉద్యోగాలు ఊడగొట్టారన్నారు. ఉద్యోగం పోయి రోడ్డున పడ్డ వలంటీర్లు ప్రభుత్వానికి కనపడలేదా అని ప్రశ్నించారు. రాబోయే జగనన్న ప్రభుత్వంలో ప్రజా సంక్షేమంతో పాటు కార్యకర్తలందరినీ గుర్తుంచుకొని న్యాయం చేస్తాడని తెలిపారు. నూతన మండల కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రాజునాయుడు, జెడ్పీటీసీ కుర్లి దామోదర్‌రెడ్డి, నాయకులు షామీర్ బాషా, కోళ్ల కృష్ణారెడ్డి, రామసుబ్బారెడ్డి, లక్ష్మిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, హరినాథరెడ్డి, ఆనందరెడ్డి, గోవిందు, రఫీ, మజీద్, హనుమంతరెడ్డి, మధు, రఘు, పురుషోత్తమరెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటరంగారెడ్డి, కుర్లి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు

పుట్టపర్తి టౌన్: ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని పార్టీ శ్రేణులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాజీఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పుట్టపర్తిని అన్నివిధాలా అభివృద్ధి చేశామని, సత్యసాయి పేరుతో జిల్లానే ఏర్పాటు చేశామన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పుట్టపర్తి అసాంఘిక కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా మార్చారని, ఇందుకు కూటమి నాయకులు సహకరిస్తుండగా ఎమ్మెల్యే, అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. అనుబంధ సంఘాలు ఏర్పాటు చేసుకొని పార్టీ బలోపేతానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి, వైస్ చైర్మన్ తిప్పన్న, పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, కౌన్సిలర్లు చెరువు భాస్కర్‌రెడ్డి, పవన్, పరశురాంనాయక్, మాజీ కౌన్సిలర్లు నారాయణరెడ్డి, రాంజీనాయక్, ఈశ్వరప్ప, సొసైటీ అధ్యక్షుడు రుషీకేశవరెడ్డి, మాజీ పట్టణ కన్వీనర్ మాధవరెడ్డి, మహిళా నేతలు సాయిలీల, కవిత, నాయకులు నాగిరెడ్డి, చింతా శ్రీధర్ రెడ్డి, ఆదినారాయణరెడ్డి, గోపాల్‌రెడ్డి, వడ్డె భాస్కర్, సోమశేఖర్‌రెడ్డి, వేణురెడ్డి, లింగాల భాస్కర్‌రెడ్డి, సైపుద్దీన్, సందీప్‌నాయుడు, ఫొటోసాయి, నరసింహులు, రామయ్య, రమేష్, గోపాల్‌నాయక్, రవినాయక్, విజయకుమార్‌నాయక్ పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు



నాటుసారా ఊట ధ్వంసం చేస్తున్న పోలీసులు

పుట్టపర్తి టౌన్: బుక్కపట్నం మండలం నార్సింపల్లి తండాలో శనివారం ఎక్సైజ్ పోలీసులు నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా 225 లీటర్ల నాటుసారా ధ్వంసం చేయడంతోపాటు నాటుసారా తయారు చేస్తున్న మురళీనాయక్, సావిత్రిబాయ్, భాస్కర్‌నాయక్‌ను అదుపులోకి కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ నాగరాజు తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ హరికృష్ణ, ఎస్‌ఐ అలీబేగ్, ఉమామహేశ్వర్‌రాజు, బుక్కపట్నం ఎస్‌ఐ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి రూ.7లక్షల సాయం



రంగులతో కళకళలాడుతున్న కళాశాల భవనం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల అభివృద్ధి కోసం కియా కార్ల కంపెనీ రూ.7 లక్షల ఆర్థికసాయం అందించిందని కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి శనివారం తెలిపారు. తమ కళాశాల అభివృద్ధికి ఆర్థిక సాయం అందించాలని కియా కార్ల కంపెనీ ప్రతినిధులతో విన్నవించగా వారు స్పందించి కళాశాలను పరిశీలించారన్నారు. అనంతరం కియా కంపెనీ సీఎస్‌ఆర్ కింద నిధులు మంజూరు చేశారని వివరించారు. కళాశాలలోని అన్ని భవనాలకు పెయింటింగ్ పనులు చేస్తున్నామని తెలిపారు. తరగతి గదులకు విద్యుత్ వైరింగ్, ఫ్యాన్లు తదితర పనులు చేపట్టనున్నామని వివరించారు. కళాశాల అభివృద్ధికి సహకరించిన కియా కార్ల కంపెని ప్రతినిధులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా బాబూ జగ్జీవన్‌రాం జయంతి



పుట్టపర్తిలో జగ్జీవన్ రాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



కదిరిలో జగ్జీవన్ రాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



ధర్మవరంలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

పుట్టపర్తి టౌన్: స్థానిక అంబేడ్కర్ భవనలో శనివారం మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు జగ్జీవన్ రాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే బీజేపీ కార్యాలయంలో జయంత్రి కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా నాయకులు జగ్జీవన్‌రాం దేశం కోసం చేసిన సేవలను గుర్తు చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తిప్పన్న, ఎమ్మార్పీస్ నాయకులు రాజు, ఎస్టీడీ నరసింహులు, రామయ్య, సాయికుమార్, ఫొటోసాయి, అంజినప్ప, కిష్టప్ప నారాయణస్వామితో పాటు సాయినగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు. బీజేపీ నాయకులు హరికృష్ణ, కొండమరాజు, జ్యోతిప్రసాద్, బాలగంగాధర్, జ్యోతి ప్రసాద్, రామాంజనేయులు, నారాయణ, గంగిశెట్టి, కళ్యాణ్, నారాయణస్వామి శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రాం జయంతిని పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు షేక్ బాబ్జాన్ జగ్జీవన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశం కోసం జగ్జీవన్ రామ్ సేవలు మరువలేమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలూ పాటుపడిన మహనీయుడు బాబూ జగ్జీవన్‌రాం అని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రాం జయంతి సందర్భంగా శనివారం పట్టణంలోని ఆయన విగ్రహానికి జయచంద్రారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూటీఎఫ్ నాయకులు లక్ష్మయ్య, రాంప్రసాద్, హెచ్.రామంజనేయులు, ఆదిశేషు, మొహినుద్దిన్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు: ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో ఎంపీపీ రమణారెడ్డి, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ రఘునాథ గుప్త ఆధ్వర్యంలో మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూ జగ్జీవన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఏఓ రామకృష్ణ, ఆర్‌ఐ లక్ష్మిదేవి, ఏపీఓ మంజునాథ, ఈసీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి: మాజీ ఉప ప్రధాని బాబూ జగజ్జీవన్‌రాం జయంతి సందర్భంగా శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పిన్న వయస్సులోనే బాబు జగజ్జీవన్‌రామ్ ఉప ప్రధానిగా బాధ్యతలు స్వీకరించి దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించారని కొనియాడారు. ఈఓఆర్డీ క్రిష్టప్ప, పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి, సచివాలయ, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

అమడగూరు: స్థానిక ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో శనివారం మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్ రామ్ చిత్రపటానికి ఏర్పాటు చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు గంగులప్ప, సురేష్, హరిబాబు, దొడ్డెప్ప, గంగాద్రి, లక్ష్మీనారాయణ, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మాజీ ఉప ప్రధాని జగజ్జీవన్ రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఎంపీడీఓ రెడ్డెప్ప,తనకల్లు పంచాయితీ కార్యదర్శి కృష్ణమూర్తిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కదిరి అర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నతపాఠశాలలో శనివారం ఎస్టీయూ ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రాం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడు, మాజీ ఎమ్మెల్సీ పీఙా విజయరామరాజు వర్ధంతి నిర్వహించారు. ఎస్టీయూ నాయకులు జవహర్, లక్ష్మీప్రసాద్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

మామిడిమాకులపల్లిలో అమ్మవారి గ్రామోత్సవం

అమడగూరు: అమడగూరులో వెలసిన చౌడేశ్వరీ అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా శనివారం మామిడిమాకులపల్లిలో గ్రామస్తులు అమ్మవారి విగ్రహప్రతిమను పల్లకీలో ఘనంగా ఊరేగించారు. డప్పు, వాయిద్యాల నడుమ అమ్మవారి పల్లకీని ఎత్తుకున్న యువకులు చిందులు తొక్కుతూ ఉల్లాసంగా ప్రతి ఇంటి ముంగిటకు తీసుకెళ్లారు. కోర్కెలు తీరిన వారంతా అమ్మవారికి వడివేలును సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గ్రామ నడిబొడ్డున అమ్మవారిని కొలువుదీర్చి భక్తులకు ప్రసాదాన్ని పంచిపెట్టారు. ఊరేగింపు తర్వాత అమ్మవారిని గుండువారిపల్లికి తరలించారు.

10న వారపు సంత వేలం

నల్లచెరువు: స్థానిక సచివాలయం-1 వద్ద ఈనెల 10న వారపుసంతకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి నరేష్ శనివారం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.